మానుషధర్మము.

By

K. VEERESA LINGAM

మానుషధర్మము.

30-4-1892

భ్రాతృజనులారా!

ఈలోకములో నిప్పుడెంత జ్ఞానాభివృద్ధి యగుచున్నను, మనుష్యుఁడు బాహ్యప్రపంచమునుగూర్చి తెలిసికొన్నంత యాత్మవిషయమునుగూర్చి తెలిసికొని యుండలేఁడు. ఆత్మ యున్నదని తెలియనివాఁడు లోకములో నెవ్వఁడునులేఁడు గాని, ఆయాత్మయొక్క ధర్మములిట్టివని దృఢముగా నెఱిఁగినవారు మాత్రము మిక్కిలి తక్కువగా కానఁబడుచున్నారు. మానుషరూపమును ధరించినవానికెల్లను తన్నుగూర్చి తానెఱుఁగుట ప్రథమకర్తవ్యము. తానెట్టివాఁడో తాను తెలిసికోలేకపోయినప్పుడు బాహ్యపదార్థములను వేయింటిని గూర్చి తెలిసికొన్న ప్రయోజనమేమి? ఇట్లు చెప్పుటచేత పదార్థజ్ఞాన మనావశ్యకమని నాయభిప్రాయ మెంతమాత్రమును కాదు. అది కావలసినంత యుండవలసినదే కాని యాత్మజ్ఞానమును విడిచి యితరపదార్థతత్త్వమును మాత్ర మెఱుఁగఁగోరుట శ్లాఘ్యమయిన పని కానేరదు. మనుష్యులు జలధర్మమును దెలిసికొని, నీటియావిరివలన నోడలను బండ్లను వాయువేగమున నడుపుటయేకాక వస్త్రనిర్మాణాదుల కుపయోగించు వివిధయంత్రములచేఁ బనిచేయింప నేర్చుకొన్నారు; వాయుగుణమును దెలిసికొని, గాలిబలముచేత నీటిని క్రిందినుండి మీఁదికెక్కించుటయేకాక వాయుపథమున విమానములు నడుపుటకు నేర్చుకొన్నారు; తేజోమహిమను దెలిసికొని, చమురులేనిదీపములను వెలిఁగించుటయేకాక మనోవేగమున దూరవార్తలను బంపుటకు నేర్చుకొన్నారు; పృథివీతత్త్వమును దెలిసికొని, మృత్తుతో విచిత్రపాత్రా

ముల నిర్మించుటయే కాక భూమినుండి మనుష్యసుఖసాధనములయిన నానావిధసస్యఫలాదులను బొందనేర్చుకొన్నారు. ఈప్రకారముగా భూమిమీఁదనున్న వస్తుసముదాయమును గూర్చి మాత్రమే కాక యాకాశమున సంచారముచేయు గ్రహతారకాదుల గమనాదులను గూర్చి సహితము తెలిసికొని, దారిలేని మహాసముద్రమధ్యమున దారి తప్పకుండ నావలను నడప నేర్చుకొన్నారు. ఈరీతిగా బహువస్తుతత్త్వములను దెలిసికొని మనుష్యులు బహువిధలాభములను పొందుచున్నారు. కాఁబట్టి బాహ్యప్రపంచవిషయమున మనుష్యుఁడు సంపాదించిన జ్ఞాన మింతింతయని చెప్ప నలవికాదు. ఈవఱకు సంపాదించిన దానితో తృప్తినొందక యనేకులింకను బహువిషయములయందు జ్ఞానాభివృద్ధిని గూర్చుటకు నిరంతరకృషి చేయుచున్నారు. అయినను మనుష్యులలో ఆత్మవిషయమునకంటె నన్యవిషయములయందు కృషి విస్తారముగా పొడకట్టుచున్నది. వీనినన్నిటినిబట్టి విచారింపఁగా మనుష్యునకుఁ దెలిసినదానిలో నెల్లను దన్నుఁగూర్చి తెలిసికొన్నదే మిక్కిలి తక్కువగాఁ గానఁబడుచున్నది.

నీరు మెఱకనుండి పల్లమునకుఁ బాఱుచున్నది; అగ్నిజ్వాలలు పయికి లేచుచున్నవి; బీజమునుండి మొలకయెత్తి చెట్టు పెరిగి పూవులనో ఫలములనో యిచ్చి నశించుచున్నది. సూర్యకిరణములు సముద్రములనుండి జలము నాకర్షించి వర్షరూపమున దానిని మరల భూమికిఁ బంపుచున్నవి; సూర్యచంద్రులు తమగతిచేత సంవత్సరములు, ఋతువులు, మాసములు, దినములు మొదలయిన కాలభేదములను గలిగించుచున్నారు; గుఱ్ఱములు మహాజవసంపన్నములయి పరుగెత్తుచున్నవి; తాఁబేళ్ళు మందగమనముతో ప్రాఁకుచున్నవి; చేఁపలు నీటిలో మునిఁగి యీఁదులాడుచున్నవి; పక్షు లాకాశమున నెగురుచున్నవి. ఈవిధముగా

చరాచరములయిన సమస్తపదార్థములును తమకు నియతములయి యున్న ధర్మములను మీఱక చరించుచున్నవి. స్వభావముచే నీరు పల్లమునుండి మెఱక కెక్కదు; వెలగచెట్టున గుమ్మడికాయలు కాయవు; ఏనుఁగులు పిల్లిపిల్లలను బెట్టవు; పులుగులు గడ్డితినవు; గోవులు మాంసభక్షణము చేయవు; సూర్యుఁడు మూఁడుదినముల కొకసారి యస్తమింపఁడు; చంద్రుఁడు దినమునకు మూఁడుసారు లుదయింపఁడు. వస్తుధర్మములనుబట్టి పరీక్షించిచూడఁగా సృష్టిలో నణువు మొదలు కొని బ్రహ్మాండమువఱకునుగల ప్రతిపదార్థమును నేదోయొక ప్రయోజనముద్దేశించి తన కేర్పఱుపఁబడిన నియమమునకు లోఁబడి వర్తించు నట్లు కానఁబడుచున్నది గాని యనిర్దిష్టముగా విచ్చలవిడిగా వర్తించు చున్నట్టు కానరాదు. ఇట్లు సృష్టిలోని సమస్తవస్తువులను, ప్రతిపదా ర్థమువలనను ఏదోయొక ప్రయోజనము నుద్దేశించి తదనుగుణముగా చేసిన పరమేశ్వరుఁ డొక్క మనుష్యునిమాత్రము నిర్దిష్టప్రయోజనము లేక పనికిమాలిన నిరర్థకజంతువునుఁగా సృజించియుండఁడు. కాఁబట్టి యిప్పుడు మనుష్యుఁ డేయుద్దేశముతో సృజింపఁబడినాఁడన్న యంశ మును విచారింపవలెను. మనుష్యునకు పశుపక్ష్యాది జంతుసామాన్య మయిన స్థూలదేహ మొక్కటియు, ఆధ్యాత్మికమయిన జ్ఞానదేహ మొక్కటియు, రెండు కానఁబడుచున్నవి. స్థూలదేహము తక్కిన జంతు వుల దేహములకంటె విశేష భిన్నమయినది కానందున, దేహధర్మము లన్నియు మృగధర్మములుగానే యుండును. అందుచేత మనుష్యుఁ డింద్రియమూలమునఁ బొందఁగలుగు సౌఖ్యము లించుమించుగా మృగాదుల సౌఖ్యములతో సమానమయినవిగానే యుండును. అయినను మనుష్యునకున్న యాధిక్యమంతయు జ్ఞానదేహ మయిన యాత్మను గలిగియుండుట. ఇఁక మనుష్యునకుఁగల యాత్మ

తత్త్వమెట్టిదో విచారింపవలెను. అది నిరవయవమయినదియు నిరాకారమయినదియుఁ గనుక నాశనరహితమయినది; అది స్వప్రకాశమయినది గనుక జ్ఞానాత్మకమయినది; కరుణాది గుణవిశిష్టమయినది గనుక కారుణ్యమయమయినది. ఇట్టి గుణములుగల యాత్మ సృష్టిలోని మఱి యేపదార్థమునందును గానఁబడదు. ఈశ్వరుఁ డొక్కఁడు మాత్రమే యిట్లాత్మస్వరూపుఁడయి యున్నాఁడు. సృష్టిపదార్థములనుబట్టియు మన యాత్మతత్త్వమునుబట్టియు సృష్టికర్తయైన యీశ్వరుని గుణములను పరిశీలింపఁగా మనుష్యబుద్ధిచేతఁ దెలిసికోఁదగి యున్నంతవఱకు మనుష్యాత్మలయందుఁగల లక్షణములే యీశ్వరుని యందును గానవచ్చుచున్నవి. కాఁబట్టియే మనుష్యుఁడు స్థూలసూక్ష్మశరీరధారణమునుబట్టి సగము మృగమనియు సగము దేవుఁడనియు చెప్పఁబడుచున్నాఁడు. మాంసశరీరములో మృగత్వమును, జ్ఞానశరీరములో దేవత్వమును కలవనుటకు సందేహములేదు. మనయాత్మలు పరమాత్మునితో సమానమయిన గుణములు కలవేయయినను, జీవాత్మకును పరమాత్మకును విశేషతారతమ్యము గలదు. పరమాత్ముఁడు సర్వజ్ఞుఁడు; జీవాత్ముఁడు మితజ్ఞుఁడు; పరమాత్ముఁడు సర్వశక్తుఁడు; జీవాత్ముఁడు పరిమితశక్తుఁడు; పరమాత్ముఁడు సమస్తకళ్యాణగుణ పరిపూర్ణుఁడు; జీవాత్ముఁడు సమస్తసద్గుణాంకురవిశిష్టుఁడు. అగ్నిహోత్రమునకు తాపమును, పర్వతములకు కాఠిన్యమును ధర్మములయినట్లే మనయాత్మలకు జ్ఞానము నీతియును ధర్మములు. అగ్నిహోత్రము తాపమును విడుచుట యెట్లు అసహజగుణమో మనయాత్మలు నీతిని విడుచుటయు అట్లే యసహజగుణము. నీతిని గలిగియుండుట మానవాత్మకు స్వాభావికము; అదిలేకుండుట యస్వాభావికము. మామిడి పండ్లకు మధురరసాదులను గలిగి రమ్యముగానుండుట స్వాభావి

కము; పుప్పిపట్టి చెడి వికారముగా నుండుట యస్వాభావికము; దేహమునకు బలారోగ్యములు కలిగియుండుట స్వాభావికము; రోగాదులచే దుర్బలమయి పాడగుట యస్వాభావికము. ఈప్రకారముగానే యాత్మకును నీతిజ్ఞానాదులచే నానందమనుభవించుట స్వాభావికము; పాపాజ్ఞానాదులచే సంతోషముచెడి బాధపడుట యస్వాభావికము. ప్రతిమనుష్యుఁడును మొట్టమొదట దేహమునకు రోగములు రాకుండ కాపాడుకొనవలసినట్లే యాత్మను పాపరోగములంటకుండునట్లు కాపాడుకొనుచు రావలెను; అటుతరువాత ప్రమాదాదికమువలన శరీరమును వ్యాధి యాశ్రయించినప్పుడు మందువేసి రోగమును మాన్పి యారోగ్యదశను పొందఁబ్రయత్నించుట యెట్లు ధర్మమో యట్లె యాత్మను పాపరోగమాశ్రయించి దుఃఖపెట్టుచున్నప్పు డనుతాపౌషధముచేత దానిని స్వస్థపఱిచి మరల సుఖస్థితికిఁ దెచ్చుటకయి ప్రయత్నించుటయుఁ బరమధర్మము. వేఁడిమిని విడిచిన బొగ్గెట్లగ్నిహోత్రమని పిలువఁబడఁదగదో యట్లే మనుష్యుఁడును నీతిని విడిచినతరువాత మనుష్యుఁడని పిలువఁబడఁ దగఁడు. నీతియే మనుష్యలక్షణము; నీతియే మనుష్యునకు పరమధర్మము; నీతిబంధమే మనుష్యుని కీశ్వరునితోడి వీడని చుట్టఱికమును గూర్చుచున్నది. నీతివర్తనముచేత నీశ్వరసామీప్యమును బొంది నిత్యానందమును బొందుటయే మనుష్యజీవనమువలని పరమప్రయోజనము. కాఁబట్టి ప్రతిమనుష్యుఁడును నీతిమార్గమునఁ బరమేశ్వరుని జేరి యానందింపఁ గలుగుటకయి సర్వవిధములఁ బ్రయత్నింపవలెను. ఒక్క యీ నీతిగుణమువలననే మనుష్యుఁడు పవిత్రుఁడయి యీశ్వరునికి పుత్రుఁడగుటయేకాక యీశ్వరకుటుంబమయిన సమస్త మానవకోటిని భ్రాతలనుగాఁ జేసికొనుచున్నాఁడు. నీతిమహిమను

బట్టియే మనుష్యపదమెంతో పవిత్రమయి గౌరవనీయమయిన దగుచున్నది.

పర్వతమునకు కాఠిన్య మెట్లు సహజగుణమో మనుష్యునకు నీతి యట్లే సహజగుణమయినను, ఈరెండు సహజధర్మములకును కొంత వ్యత్యాసమున్నది. మనుష్యుఁడు పర్వతమువలెఁగాక స్వతంత్రుఁడయి కొంతవఱకు స్వేచ్ఛగాఁ బ్రవర్తింపఁదగినవాఁడు. విషయసుఖములు మనుష్యునకును మృగమునకును సామాన్యములనియు దేహసంబంధమువలన మనుష్యునిలో మృగధర్మముకూడఁ గొంత యున్నదనియు నీవఱకే చెప్పియున్నాను. మృగధర్మము మనుష్యధర్మమునకంటె భిన్నమగుటచేత, అవి రెండును ఒకచోటఁ జేరినప్పుడు పరస్పరవిరోధము సంభవింపక తప్పదు. అయినను మనుష్యుఁడు స్వేచ్ఛావివేకములనుబట్టి, మృగధర్మమునకును మనుష్యధర్మమునకును విరోధము పొసఁగినప్పుడు మృగధర్మము నడఁచి లోఁబఱుచుకొని తన యిచ్ఛానుసారముగా మెలఁగునట్లుచేసి దానివలని లాభమును పొందుచుండవలెను. జీవాత్మకు జ్ఞానాంకురములును నీతిబీజములును గలవనియు వానిని వృద్ధిచేసికోవలయుననియుఁ గూడ నీవఱకే సూచించియున్నాను. జ్ఞానాదులు హీనదశలో నున్నప్పుడు పశుధర్మములని చెప్పఁబడిన మాంసగుణములు ప్రబలమయినవిగా నుండును. ఆకాలమునందు మనుష్యున కీశ్వరవిజ్ఞానమును తదనుగుణమయినదిగానే యుండును. ప్రపంచముయొక్క యారంభదశలో జ్ఞానాభివృద్ధి విశేషముగా కలుగనప్పుడు దేహబల మధికముగా నున్నవాఁడెవ్వఁడో వాఁడు గొప్పవాఁడుగాను నాయకుఁడుగాను అంగీకరింపఁబడి గౌరవింపఁబడుచు వచ్చెను. ఆకాలమునందు జనులు తాము భయపడి గౌరవించు నరుని గుణములనుబట్టి భగవం

తుని సర్వశక్తునిగాను, మేఘవాహనమెక్కి పిడుగులను బఱపి శత్రువులను నాశనము చేయువానినిగాను, భావించి భయముతో బలులు మొదలయినవానిని సమర్పించి యారాధించుచు వచ్చిరి. తరువాత జనులలో జ్ఞాన మభివృద్ధియైన కొలఁదిని దేహబలమునందు గౌరవము తగ్గి కాయబలముగలవానికంటె బుద్ధిబలముగలవాఁ డధికుఁడయ్యెను. దేహబలము గలవానిని బలహీనులయినను పదిమంది జేరి గెలువఁ గలుగుటయు, దేహబలము గలవారు వేయిమంది చేరియైనను జ్ఞానబలము గలవాని యుపాయములముందు నిలువలేకుండుటయు చూచి యద్భుతపడి, జనులు కేవల దేహబలము గలవానిని విడిచి వస్తుతత్త్వమును దెలిసి ఆలోచన గలిగి, ఉపాయశాలియైన బుద్ధిమంతునిఁ దమకు నాయకునిగాఁ జేసికొని గౌరవింపసాగిరి. లోకానుభవ మెక్కువయయి జ్ఞానాభివృద్ధి కలిగినకొలఁదిని జనులు సృష్టిలోని ప్రతివస్తువులోను దేవుని బుద్ధిబలము కనిపెట్టి దేవుని సర్వశక్తునిగా మాత్రమే కాక సర్వజ్ఞునిగాకూడ భావించి యద్భుతప్రమోదములతోను భయముతోను నర్చించుచుండిరి. జ్ఞానాభివృద్ధి యధికమయి మనుష్యతత్త్వము చక్కఁగా తెలియ నారంభించిన తరువాత జనులు దేహబలము కలవానికంటెను జ్ఞానబలము కలవానికంటెను నీతిబలము గలవాని నెక్కువగా గౌరవించి, ఎవ్వఁడు సత్యము తప్పకుండునో యెవ్వఁడు ఋజుమార్గమున ప్రవర్తించునో యెవ్వఁడు పరోపకారపారీణుఁడగునో యట్టివానిని ప్రేమించి దేవాంశకలవానినిగా భావింప మొదలుపెట్టిరి. అప్పుడు మనుష్యు లీశ్వరవిషయమున గూడ నభిప్రాయములు మాఱినందున, దేవుని సర్వశక్తునిగాను సర్వజ్ఞునిగాను మాత్రమేకాక సత్యస్వరూపునిగాను సర్వకారుణ్యునిగాను గూడ భావించి ప్రేమించి, యద్భుతభయభక్తులతోఁ బూజింప నారం

భించిరి ఈప్రకారముగా మనుష్యుని యభిప్రాయములోను మతము లోను నభివృద్ధి కలుగుచున్నను, నీతివిషయమున నింకను దగినంత దృఢనిశ్చయము కలుగలేదు. కొందఱు మతవిషయమున మార్పులు కలుగుచుండరాదని వాదింపఁ జూతురుగాని మనుష్యునితో సంబం ధించిన సమస్తవిషయములయందును నభివృద్ధి కలుగుచుండఁగా నాత్మోజ్జీవనమున కాధారమయిన మతవిషయమునందేల యభి వృద్ధి కలుగరాదందురో యూహించుటకు శక్యముకాకున్నది. ఆత్మ తత్త్వ మధికముగాఁ దెలిసిన తరువాత మునుపటివలె నీశ్వరుఁడు భయమునకు హేతువయినవాఁడుగాక ప్రేమాస్పదుఁడయి కారుణ్య గుణమునుబట్టి దరిఁజేరవలసిన తండ్రి యయినాఁడు. ఇంకను జ్ఞానాభి వృద్ధి యైనకొలఁదిని దేవుని కళ్యాణగుణము లింకను క్రొత్తవి యేవి బయలఁబడునో యెవ్వరెఱుఁగుదురు ? అందువలన మనకెట్టి యధికా త్మానందము కలుగునో యెవ్వరూహింపగలరు ? ఏవిషయమునం దభివృద్ధికి భంగము కల్పించినను మనకనేకనష్టములు కలుగును. అందులో ముఖ్యముగా మతమను పేరుపెట్టి యాత్మాభివృద్ధికి భంగము కలిగించెడు పక్షమున, కలిగెడు యనర్థ మింతంత యని చెప్పనలవికాదు. ఒకవేళ మానుషధర్మమునకే భంగముకలుగ వచ్చును. కాఁబట్టి యెల్లవారును దా మాత్మాభివృద్ధికి విఘ్నము కలి గించుమార్గమును గొంచెమయినను తలపెట్టకుందురుగాక ! జ్ఞానము నందును నీతియందును వృద్ధిలేకపోవుటయే మానుషధర్మమునకు భంగము కలుగుట. ఆత్మ మార్పులేక యెల్లకాలము నేకరీతిగా నుండు స్వభావము కలదికాదు— జ్ఞానాధిక్యాదులచేత దేవత్వమునైనను సమీపించుచుండును; లేదా తదభావాదులవలన మృగత్వము నయి నను సమీపించుచుండును. కాబట్టి వివేకియైనవాఁ డప్రమత్తుఁ

డయి యాత్మను మృగత్వమును సమీపింపనియ్యక జ్ఞానాభివృద్ధిచే నీశ్వరుని సమీపింపఁ జేయుటకే సర్వదా పాటుపడుచుండవలెను. ఈశ్వరుని సమీపించుట కనుకూలమగునట్లుగా నిహలోకయాత్ర నడుపుచు నాతనిని పొందయత్నించుట మనుష్యునకు బరమార్థము. పాపవిమోచనమును బొంది సద్వర్తనముచే నీశ్వరునిబొంది యానందింపఁ గలుగుటయే ముక్తి—అనఁగా . పాపమునుండియు మృగత్వమునుండియు విముక్తులమయి నిత్యానందమును బొందుటయే ముక్తి. ఆత్మగుణముల నన్నిఁటిని వృద్ధిచేసికొనుటయే ముక్తిమార్గము. అన్నిశక్తులను సమానముగా పెంపుచెందించుట వృద్ధి కాని యొకదానికి నష్టము కలుగునట్లుగా మఱియొకటి పెరుగుట వృద్ధి కాదు. శరీర విషయమయిన వృద్ధిని ముందుగా జూడుఁడు. దేహముయొక్క సమస్తావయవములును సమానముగాను బలప్రదముగాను పెరుగుట వృద్ధియగునుగాని యొక్క తలగాని పొట్టగాని కాలుగాని బలియుట వృద్ధికాదు; అట్లొక్క యవయవము మాత్రమే పెరిగినచో దయ్యపు తలయనియు, బానకడుపనియు, బోదకాలనియు పేరులుపెట్టి దానిని వ్యాధిమూలముగా నెంతురు; బలములేక యుబ్బురోగమునందువలె దేహమంతయు బలియుటయు వృద్ధి కానేరదు. కాఁబట్టి యీవిధముగానే యాత్మవిషయమున జ్ఞానమును, నీతియును, ప్రేమాదులును, ఈశ్వరభక్తియును, సమానముగా వృద్ధినొందవలెను. ఇట్టి యభివృద్ధిని, పాపపరిహారమును బొంది నిత్యానందమునకయి ప్రయత్నించుట యెల్లవారికిని సహజగుణము. జ్ఞానాభావాదులచేతను తత్త్వవిచారము లేకపోవుటచేతను మనుష్యులు తప్పుదారులు త్రొక్కుచున్నను, నిత్యానందపదవి నిమిత్తమయి కృషిచేయవలెనన్న యభిలాషమాత్ర మనివార్యమయి పామరుఁడు మొదలుకొని పండితుని

వఱకును గల ప్రతిమనుష్యుని హృదయము నందును దృఢముగా నాటు కొనియున్నది. ఈ నిత్యపదవి నిమిత్తమే మూఢులుపవాసములుచేసియు తీర్థసేవలుచేసియు, నిప్పులుత్రొక్కియు, శూలములు గ్రుచ్చుకొనియు బాధపడుచున్నారు; జ్ఞానుల మనుకొను సన్యాసులు ప్రేమాస్పదులయిన భార్యాపుత్రాదులను ధనవస్తువాహనములను తక్కిన సమస్తప్రాపంచికసుఖములను త్యజించుచున్నారు; మోగు లెండలలో మాడియు, పంచాగ్నిమధ్యమున వసించియు, కాళ్ళను చేతులను శుష్కింపఁజేసియు, ఆకలములు తిని యేకాకులయి తిరిగియు, శ్రమపడుచున్నారు. మోక్షాపేక్ష యెల్లవారికిని దుర్వారముగానున్నను తత్త్వవిచారము చేయక యంధపరంపరగా వర్తించుచుండుటవలనఁ బలువురు సత్యమైన మార్గమును దెలిసికోలేక భ్రమపడి తిరుగుచున్నారు. మనలను మోక్షమునకుఁ గొనిపోయెడు రాజమార్గము పయినజెప్పిన రీతిగా జ్ఞానాదులను వృద్ధిపఱచుకొని, యీశ్వరునియందు సంపూర్ణవిశ్వాసము గలవారమయి మనకీశ్వరుఁడు విధించి యున్న ప్రకారముగా మనలోపల వెలుఁగు జ్ఞానజ్యోతి ననుసరించి మనయంతరాత్మ బోధించు నీతిమార్గమున వర్తించుట యొక్కటియే. కాఁబట్టి యెల్లప్పుడును నీతిమార్గముననే నడచుచుండుట మనకు విధి; ఎన్నికష్టముల కయిన సహించి నీతిమార్గానుసరణమనెడి యీశ్వరాజ్ఞను నిర్వహించుట కెల్లరమును బద్ధులమయి యున్నాము. ఆత్మాభివృద్ధినిబట్టి యీ కర్తవ్యతాబుద్ధి మనుష్యులలో బలపడును.

ఆత్మాభివృద్ధి యైనకొలఁదిని జీవుఁ డీశ్వరునితోడి బంధుత్వమును దృఢపఱచుకొని యాతని సామీప్యమును బొంది నిత్యసేవవలన నీశ్వరసాంగత్యసుఖము ననుభవించుచుఁ బాపదూరుఁడయి నిత్యానందపదవి నొందఁగలుగును. ఈశ్వరుఁడు సకలకళ్యాణగుణ

సాగరుఁడు; జీవాత్మలు నీతిరసప్రవాహములు. నదులు సముద్రమును జేరఁబోవునట్లుగానే మన యాత్మలును పరమేశ్వరుని జేర సంతత యాత్ర చేయుచుండవలెను. ఆత్మధర్మమయిన నీతియం దభివృద్ధిని బొంది పురోయాత్ర చేసినకొలఁదిని మనయాత్మ లీశ్వరుని సమీపించు చున్నవని చెప్పుదురు. నీతియం దభివృద్ధి నొందుటయే మనుష్యుని లోని దేవాంశమును వృద్ధినొందించుట. కాఁబట్టి మనుష్యనామమును ధరించినవాఁడెల్లను తా నొకదినమునకంటె నొకదినము మఱింత పరిశుద్ధుఁడగుచు తనయందలి దేవాంశమును వృద్ధినొందించుటకు పాటుపడుచుండవలెను. మనుష్యుఁడు తానేవృత్తి నవలంబించినను, ఏపనిచేయుచున్నను, నీతిమార్గమును విడువక పవిత్రమయిన మనుష్య నామమునకు తానర్హుఁడగునట్లుగా ప్రవర్తింపవలెను. మనుష్యుఁడను పేరులోనే యెంతగౌరవమున్నది! అది రాజనామముకన్నను, శాస్త్రి నామముకన్నను, గౌరవావహమయిన యే యితర నామముకన్నను, మిక్కిలి యుత్కృష్టమైనది. రాజ్యాధికారముచేత నొకఁడు రాజయ్యును నీతి లేకపోవుటచేత పశువు కావచ్చును; విద్యావైభవముచేత నొకఁడు శాస్త్రియయ్యును నీతిలేకపోవుటచేత మృగము కావచ్చును. ఇహలోకవైభవము లేవి లేకపోయినను మానుషధర్మమును విడువక చరించినవాఁడొక్కఁడే యీశ్వరదృష్టికి గొప్పవాఁడును, తదనుగ్రహపాత్రుఁడును అగును గాని మానుషధర్మమును మీఱుటచేత మనుష్యనామమున కపాత్రుఁడైన రాజును, శాస్త్రియు, గారు. నీతి మానుషలక్షణమనియు, నీతిలేమి పశులక్షణమనియు, దృఢముగా తెలిసికొని మన మెప్పుడును నీతిపాశమునకు బద్ధులమై ప్రవర్తింపవలెను; నీతిపాశమే యీలోకములో మనుష్యులను బరస్పరమును గూర్చెడి యనుబంధము, ఈ యనుబంధమే మిక్కిలి పావన

మైనదియు, భూమిలోఁగల సమస్తగుణబంధములలోను స్థిరమయిన దియు అయియున్నది. నీతిపాశమునుబట్టియే జను లన్యోన్యభ్రాత లయి యేకమగుచున్నారు; ఈ బంధము విడిపోయెనా జనులైక మత్యములేక చెదరి పరస్పరశత్రు లగుచున్నారు. 'నీతి' యని నే నిక్కడ నొక్క చిన్నపదమును జెప్పుచున్నను దానిలో నెంతో యర్థ మిమిడియున్నది; ఆ చిన్న పదములో సత్యము, కారుణ్యము, క్షమ, పరోపకారము, మొదలైన గుణములనేకములు చేరియున్నవి. వానిని వివరించుట కిప్పుడవకాశము లేదు. వానిలో నొక్కొక్కదానిని గూర్చి ప్రత్యేకముగా నెంతెంతో చెప్పవలసియున్నది. నీతిబలము ముందు ప్రపంచములోని యనావశ్యకములైన భేదములన్నియు గాలికి దూదిపింజె లెగిరిపోవునట్లు చెల్లాచెదరగును. నీతిమంతుఁ డెవఁడో వాఁడే సర్వోత్కృష్టుఁడగుటచేత, నీతిబలమునుబట్టి యధమ జాతివాఁడును పూజనీయుఁడగును. నీతిరతియొక్కటియే మనకీశ్వరుఁ డనుగ్రహించిన శ్రేయస్సులలోనెల్ల మహోన్నతమయినది. ధర్మ రతియు, యుక్తాయుక్తములను దెలిసికొని యుక్తము నాచరించు మతియు, భగవదాజ్ఞారూపమున హృదయములో నంతరాత్మ చేయు బోధమును, పుణ్యాచరణసామర్థ్యమును, — ఇవి మనుష్యునకుఁగల గుణరత్నములు. లోకములో వీనికన్న నున్నతగుణము లేవియు లేవు. దేవతలయందుసహిత మింతకంటె మహత్తరమయినది వేఱేదియు లేదు. ఈగుణములు పూర్ణముగా నున్నప్పుడు దేవతలకును మనుష్యు లకును భేదము లేకయేపోవును. అప్పుడు భూలోకమే స్వర్గలోక మగును; మనుష్యులే దేవతలగుదురు. ఈగుణములను వృద్ధిపొందించు కొనుకొలఁదిని మనుష్యుఁడు దేవత్వమును సమీపించుచుండును. నీతి మార్గము ననుసరించి ప్రవర్తించుపక్షమునఁ బ్రతిమానవుఁడును నిరం

తరాభివృద్ధియు నిరతిశయానందమును బొందఁగలుగును. నీతివర్తనము స్వర్గమార్గము; నీతిరాహిత్యము నరకమార్గము. ఎప్పుడు మనస్సులలో యుక్తాయుక్తజ్ఞాన ముద్భవిల్లి యుక్తమార్గమున నడువవలయుననియు, అయుక్తమార్గమున నడువఁగూడదనియు మనయంతరాత్మ బోధింప మొదలుపెట్టినదో యప్పటినుండియు నీతిమార్గమును మీఱి చరింప కుండుటకు మన మీశ్వరునకు బద్ధులమై యున్నాము. మన మనస్సులలో నుదయించి భాసిల్లుచున్న యీ యుక్తాయుక్తవివేచకజ్ఞానమే యీశ్వరుఁడు మన కనుగ్రహించిన సత్యవేదము. తక్కినవేదములన్నియు దీని ననుసరించి బుద్ధిమంతులచేఁ గాలానుగుణముగా వ్రాయఁబడినవే. హృదయఫలకమునం దీశ్వరలిఖితమైయున్న యీనీతిబోధమే మన కీశ్వరునితోడి చుట్టఱికమును నెఱపి మనల నాతని నిత్యానందసామ్రాజ్యమును చూఱగొనునట్లు చేయును. ఈ జ్ఞానోదయమే స్థిరముగా మనల నీశ్వరగుణబద్ధులను జేయును. ఈజ్ఞాన ప్రకాశముచేత ధర్మరతి యెవ్వని హృదయమునందు దృఢముగా నాటుకొనునో వాఁడా దినమునుండియు ప్రపంచమునందలి యెవ్వరి చేతను మరల్పరాని యొకపాశమునకు బద్ధుఁడయి, ఈశ్వరునితోడ విడిపోని నూతనబంధుత్వమును పొంది, తనహృదయములో దివ్యాక్షరములతో లిఖింపఁబడియున్న యీశ్వరాజ్ఞ కొక్కదానికే లోఁబడి, అంతరాత్మ బోధించు శాసనముల ననుసరించుటయే శాశ్వతానందమునకు మూలమని నమ్మి, లోకములోని దేది యెట్లయినను సమస్త విషయములయందును తనయంతరాత్మను తన్మూలమున పరమేశ్వరుని సంతోషపెట్టుటకే ప్రవర్తించుచుండును. ఈ యంతరాత్మ బోధించు బోధమే శాశ్వతానందమహావృక్షమునకు బీజము. ప్రతి విషయమునందును దానిని తప్పక యనుసరించుచు వచ్చిన పక్షమున,

మనము కృతార్థులమయి దినదినాభివృద్ధినొంది సత్యపదవి నొందుదుము; దానిఘోషమును పెడచెవిని బెట్టి తద్వాక్యముల ననాదరణము చేసినపక్షమున, మనము దుఃఖభాజనులమై యీశ్వరానుగ్రహమునకు దూరుల మగుదుము. ఆత్మావబోధమునుబట్టి యీశ్వరానుగ్రహమువలన న్యాయవర్తనము నెవ్వరు పొందఁగలుగుదురో వారెల్ల ప్రేమానుబంధముచేత బద్ధులయి పరస్పర సోదరస్నేహము గలవారగుదురు. ఈసోదర వాత్సల్యమునకు నీతిరతి యొక్కటియే కారణముగాని లౌకికాధికారమును ధనసంపదయు సత్కులప్రసూనత్వమును గారణములు గావు. ఇహలోకసంపద లెల్లను గలిగియున్నను నీతిబాహ్యుఁడగుటవలన మనుష్యుఁడు ధర్మదృష్టికి పశుప్రాయుఁడయి యీశ్వరసాంగత్యమున కనర్హుఁడు కావచ్చును. ఇహలోకసంపద లేవియు లేకపోయినను నీతిమంతుఁడగుటవలన మనుష్యుఁడు దేవతుల్యుఁడయి యీశ్వరసాంగత్యమున కర్హుఁడు కావచ్చును. కాఁబట్టి మోక్షానందపదవికిని ఐహికౌన్నత్యమునకును సంబంధమేదియు లేదు. మన మొకవేళ వారిపేరుల నయినను వినకపోయినను నిజమయిన నీతిమంతు లీలోకమునందు విస్తారముగా బీదవారిలోనే యుండవచ్చును. మిక్కిలి దుర్లంఘ్యములైన వ్యామోహములకు లోఁబడనివారును, దుస్సాధ్యములయిన ధర్మకార్యములను పూనికతో నిర్వహించినవారును, ఎటువంటి యాపదలు వచ్చినను వెనుకతీయక యొక్క యీశ్వరుని ప్రాపునే నమ్మికొని తదాజ్ఞానుసరణమే నిత్యకృత్యముగా ప్రవర్తించినవారును, దుస్తరములైన పాపసముద్రముల నీఁది యతికష్టపడి దుష్టుల బాధలను సహించి పరిశుద్ధమయిన జీవయాత్రను చేసినవారును బీదవారిలోనే యుండవచ్చును. ఈశ్వరునిదృష్టియం దిట్టివారు మాత్రమే నిజమైన గొప్పవారు. గొప్పతన మెప్పుడును నీతి

బలములోను, భగవదాజ్ఞానుసరణములోను, కష్టములను ధైర్యముతో సహించుటలోను, ఇంద్రియనిగ్రహములోను, ఉండును గాని ధనికత్వ దరిద్రత్వములలో నుండదు. కండక్రొవ్వువలన నింద్రియము లుద్రేకించి దుర్మార్గమున కాకర్షించునప్పుడు వాని యుద్రేకమును ధర్మపాశములచే నడంచి పోరాడి వానిని యుక్తమార్గమునకుఁ ద్రిప్పి యాధ్యాత్మికబోధమువలన నింద్రియవర్గమును నిగ్రహించి తనయధీనములో నుంచుకొనుటకయి పాటుపడుట మనుష్యధర్మము. ఇంద్రియబద్ధుఁడయి యింద్రియసుఖములకు దాసుఁడుగాక యింద్రియ నిగ్రహము చేయఁగలిగిన పురుషుఁడే నిజమయిన పౌరుషము గల వాఁడు. ఇంద్రియనిగ్రహము చేసి మంచిమార్గముల నడువలేని పుణ్యభీరుఁడు మీసములు మొదలయిన సమస్తపురుషచిహ్నములను గలవాఁడైనను పౌరుషహీనుఁడే. పాపముతోడి పోరాటమువలనను, కష్టములకును బాధలకును చలింపక నీతిపక్షమున నిలుచుటవలనను మాత్రమే మనుష్యుఁ డధికుఁడగును. కష్టములును, నిర్బంధములును వచ్చినపుడు ధర్మమార్గమును తొలఁగనివాఁడొకఁడే మహానుభావుఁడు; అతఁడొక్కఁడే మానుషధర్మముగలవాఁడు. పాతకభూతములతో పోరాడి గెలువఁ గలిగినప్పుడే యాత్మకనిర్వాచ్యమైన, యనుభవైకవేద్యమయిన యానందము కలుగును. ఈశ్వర మహిమను భూమియందు భాసిల్లజేయుటకయి పాపపిశాచములతో వీరభటునివలె నిరంతర యుద్ధము చేయుచుండు వానికే యీశ్వరుఁ డెప్పుడును సహాయుఁడయి జయమును గలిగించుచుండును. ధర్మ మెక్కడ నుండునో యీశ్వరుఁ డక్కడనుండును; ఈశ్వరుఁ డెక్కడనుండునో జయమక్కడఁ గలుగును. కాఁబట్టి లోకములో ధర్మబలముతో సమానమయిన బలము వేఱొకటిలేదు. ఈశ్వరుఁడు మంచికార్యముల కెప్పు

డును త్రోడుపడుచుండుట సత్యమే యయినను, అతని సాహాయ్యమును పొందుటకు మన మర్హులమని చూపుటకై పిఱికికండలేని వీరభటుల వలె నసహాయశూరులమయి నిలిచి మనము పాపములను పెనుభూతములపయి ధ్వజమెత్తి వానిని నిర్మూలనము చేయుటకయి యెల్లప్పుడును నడుముకట్టుకొని నిర్భయముగా ముందుకు నడుచుచుండవలెను; అప్పుడు పాపభూతావిష్టులయియున్న వారివలనను దీర్ఘకాల దురాచారపిశాచావేశపరవశులయియున్న వారివలనను, మూర్ఖతారాక్షసప్రేరితులయిన వారివలనను మన కనేక విధములయిన కష్టములు రావచ్చును. గాయములు లేని పోరాట మెక్కడను గలుగదు; గాయములకు వెనుకతీసెడు వీరభటత్వమును గలుగదు. క్షణభంగురము లయిన యిహలోకసంపదల నిమిత్తము పోరాడునప్పుడే వీరుఁడైనవాఁడు శరీరమును విడువఁ దెగింపవలసియుండఁగా, పారలౌకికశాశ్వతానందపదవికై పెనఁగులాడెడు సత్కార్యశూరుఁడు విడువగూడని దీలోకములోని దేదియుండును? కష్టము లన్నిప్రక్కలను వచ్చి చుట్టుకొన్నప్పుడును, బంధుమిత్రాదులు సహితము ప్రతిపక్షులయి ద్వేషించి మహాధైర్యశాలికి సహితము భయమును నిరాశయు కలుగునట్లుగా బాధించుచున్నప్పుడును, మన దుర్బలత్వమును దెలిసికొని యీశ్వరసాహాయ్యమును వేఁడి తత్సామీప్యమువలన నూతన బలోత్సాహములను పొంది పాపబలనిర్మూలనమునకయి యమానుష ధైర్యమును జూపవలెను. అట్లు చేసినప్పుడే మనుష్యుని గొప్పతనము వెల్లడి యగును. ఘటనాఘటనసమర్థుఁడయిన యీశ్వరుని ప్రాపువలన ధర్మశూరుల వజ్రహృదయములనుండి ప్రతిపక్షులు ప్రయోగించు వ్యాఘాతశిలల తాకుడువలన నార్పరాని యుత్సాహాగ్ని యుదయించి పురాణములయందు వర్ణింపబడిన బ్రహ్మాస్త్రమువలె నమోఘ వైరి

విజయకారణము కావచ్చును. ఇట్లుత్సాహవాక్యములు పలుకునప్పుడుపదేశమునం దిది యంతయు మనోహరముగా నేయున్నది గాని యనుష్ఠానసాధ్యమగునా ? యని కొందఱి హృదయములయందు సందేహము గలుగవచ్చును. అయినను నేనిప్పుడు చెప్పినదంతయు భగవచ్ఛక్తియందు సంపూర్ణవిశ్వాసముగల ధర్మశూరులకుఁ బరమసాధ్యమే కాని యిందసాధ్యమేదియు లేదు. ఇట్టి సర్వజన శ్లాఘనీయమయిన పవిత్రచరిత్రముగల మహాత్ముల మహిమలను మనము పూర్వచరిత్రములయందుఁ జదివియున్నాము. సత్యము నిమిత్తమై సర్వకష్టములకును లోనయి సమయము వచ్చినప్పుడు తమప్రాణములను సహితము తృణప్రాయముగా విడిచిన కీర్తికాయు లనేకులు చిరకాలము క్రిందటనే స్వర్గస్థులయ్యును నేఁటివఱకును మృతజీవులయి మన హృదయనివాసమును విడువక సమస్తసత్కార్యాచరణములందును మనకపరిమితోత్సాహసాహసములను కలిగించుచున్నారు. అట్టివారి చరిత్రములను పూర్ణముగా వివరింపవలసినదేకాని యట్టిపని కిది సమయముకాకపోవుటచేత దానినింకొకసారికి విడిచిపెట్టి యిప్పుడు సత్కార్యాచరణమున కావశ్యకములయిన మనోధర్మములనుగూర్చి కొంచెము చెప్పెదను.

ఒక్క సత్కార్యమును పూని నిర్వహించుటకయి మనుష్యునకు మొట్టమొదట మనోనిశ్చయ మొక్కటి యుండవలెను. మనోనిశ్చయము లేకపోయినపక్షమున, మనుష్యుఁ డెంతటి శక్తిసంపన్నుఁడయినను దుర్బలుఁడయి యేకార్యమును పూనుటకును సమర్థుఁడుకాకపోవును. మనోనిశ్చయము కలుగుటకయి యాత్మగౌరవ మావశ్యకము: ఆత్మగౌరవమనఁగా తనశక్తియందు తనకు విశ్వాసముండుట. ప్రతిమనుష్యునకును తాను శక్తిమంతుఁడననియు బుద్ధిమంతుఁడననియు

కొంచెముగానో గొప్పగానో మనస్సులో గర్వముండవచ్చునుగాని తానొకపని చేయవలసివచ్చినప్పుడు మాత్రము కష్టములు వచ్చునేని వానికప్పుడా యహంకారము నిలువదు. ఇట్టి పనికిమాలిన యహంభావమాత్మగౌరవము కాదు. తన సదభిప్రాయములతో నితరు లేకీభవింపనప్పుడును, తనపూనిక కితరులు విఘ్నము లాచరించుచున్నప్పుడును, తన కార్యమువలనఁ గష్టములు వచ్చునప్పుడును, నిరుత్సాహుఁడుగాక తనయాలోచనయందు విశ్వాసమును దనశక్తియందు గురుత్వమును గలిగియుండుట యాత్మగౌరవము. మనతో నేకీభవింపనంతమాత్రముచేత ననాదరముచేయక యితరుల యభిప్రాయములయం దుచితగౌరవముంచుట మనకు ధర్మమే యయినను, మన యభిప్రాయములు సరియైనవని మనము దృఢముగా నమ్మియున్నప్పుడుమాత్ర మితరుల మాటల నాదరించి మనపూనికను విడువఁగూడదు. తనకొక దృఢనిశ్చయములేక యితరుల యభిప్రాయములనే నమ్మియుండువాఁడు తానేపనియందును స్వతంత్రుఁడుగాక మహావాయుపథమునఁబడిన కాకియాకెవలె గాలి విసరిన దెసలకెల్లను దూలుచు స్వగౌరవమును లేనివాఁడగును. అట్టివాఁ డల్పకార్యమును సహితము స్వతంత్రముగా నిర్వహించుటకు శక్తుఁడుగాక వఱదకు గొట్టుకొని పోవుపుడకవలె నిటునటు నూఁగులాడుచు నొకతెన్నునఁ బోవక యాచారప్రవాహ మీడ్చినట్లెల్లను జనుచు వ్యర్థుఁడగును. కాఁబట్టి కార్యశూరునకు దృఢనిశ్చయ మావశ్యకము. గ్రహణశక్తియు సాధనసంపత్తియుఁ గావలసినంతయున్నను దృఢనిశ్చయము లేకపోవుటవలన ననేకులయందు వాక్శూరతయేకాని కార్యశూరత కానరాకున్నది. కార్యభీరుత పురుషలక్షణము కాదు; కాఁబట్టి సత్కార్యాచరణపౌరుషము గలవాఁ డితరు లేమనుకొందురోయన్న సందేహమును విడిచి ధైర్య

సాహసములను బూని తాను దృఢముగా నమ్మినదాని ననుష్ఠించుటకు బద్ధకంకణుఁడు కావలెను. ఉపదేశమునకంటె ననుష్ఠాన మెంతో శ్రేష్ఠమయినది. మన దేశమునందు శుష్కోపదేష్టలు నక్షత్రము లంతమంది యున్నను, అనుష్ఠానసమయమునం దా నక్షత్రము లంత మందియు దివానక్షత్రములంతమంది యగుచున్నారు. మన దేశమునం దిప్పు డుపదేష్టలకంటె ముఖ్యముగా ననుష్ఠాతలు కావలసియున్నారు. వేయిమాటలు చెప్పుటకన్న నొక్కకార్యమును జేసి చూపినయెడల జనులకు వారియందెంతో యధికగౌరవము కలుగును; క్రియావంతు లయినప్పుడు మాత్రమే జనులు వారి ననుసరింపఁజూతురు. పుస్తకములయందు మంచివారి చరిత్రములను జదివినప్పుడును, మంచియుపన్యాసములను విన్నప్పుడును, కొంతవఱకెల్ల వారికిని సత్కార్యములు చేయవలెనన్న యభిలాష కలుగవచ్చును గాని యాయభిలాషము సత్ప్రవర్తనమును కన్నులార చూచినప్పుడున్నంత బలిష్ఠముగాను కార్యకరముగాను మఱియొకప్పుడుండదు. ఒకవేళ నితరులు తన్ననుసరింపకపోయినను, తాను సత్యమని యెఱిఁగినదాని ననుష్ఠించుట మనుష్యునకు ధర్మము. తానాలోచించి శ్రమపడి కనుఁగొన్న సత్యమును దాననుష్ఠించి ఫలమును బొందకపోయినయెడల దానివలనఁ బ్రయోజనమేమి? తనసత్యము తనకే పనికిరానియెడల నితరులకేమి పనికివచ్చును? తనప్రవర్తనమును తాను సంస్కరించుకోలేనిపక్షమున లోకము నేమిసంస్కరింపఁ గలుగును? లోకమును సంస్కరింపఁబూనుటకు ముందుగా సంస్కారము తనతో నారంభము కావలెను. ఒక్కఁడు తనప్రవర్తనమును జక్కఁజేసికొన్నను లోకములోని దుష్టవర్తనుల సంఖ్యలో నొక్కటి తక్కువగును. ఈప్రకారముగాఁ బ్రతిమనుష్యుఁడును తననడతను దిద్దుకొనుటకుఁ బ్రయత్నించినపక్ష

మున, కొంతకాలములోనే లోకమంతయు చక్కపడవచ్చును. అట్లు కష్టపడి తనవర్తనమును బాగుజేసికొనఁజూడక ప్రతిమనుష్యుఁడును దాను పయినుండి సులభముగా లోకమును సంస్కరింపవలెనని యాలోచించుచుండుటవలన మనదేశమునం దేవిషయమునను సంస్కారము సాగకున్నది. కష్టపడి పనిచేసినచో సంస్కారము జరుగునుగాని మంత్రములవలన జరగదు. అజ్ఞానాంధకారముచేత మార్గము దుర్గమమయియున్నప్పుడు ధర్మాచరణధైర్యము గలవారెవ్వరయినను ముందుగావొచ్చి కష్టపడి మార్గమును ఛేదించి దారిచూపి పని చేయవలెను. తెలియనివారికి తెలిసినవారు దారిచూపుట మానవధర్మము. తెలియనివారు చూపెడు తప్పుదారినే తెలిసినవారు పోవుట యధర్మము. కాఁబట్టి యజ్ఞానములోఁ బోరాడి మనము మూఢులకు త్రోవచూపి వారు మనత్రోవ ననుసరించునట్లు చేయవలెనుగాని మూఢులను సంతోషపెట్టుటకొఱకు మనమే వారిదారి ననుసరించుట నీతికాదు. మూఢులను కూడఁగట్టుకొని రావలెనని నీతిమాలి మూఢమార్గమునఁ దెలిసియు విపరీతముగాఁ బ్రవర్తించుచు వచ్చినపక్షమున, క్రమక్రమముగా మనము నిజముగానే మూఢులమయి యెన్నటికిని కడతేరనివారమగుదుము; సంస్కారమెన్నటికిని జరగదు. కాఁబట్టి యింకను కాలమురాలేదని యూరకుండక యెల్లవారును యథాశక్తిని లోకమునకు మేలుజేయుటయందుఁ బ్రవర్తింపవలెను. కాలమురాలేదనుట నీతిభీరులవచనముగాని కార్యశూరులనవలసిన మాటకాదు. విడువక కృషిచేయుచు వచ్చినచో కాలము తనంతనే వచ్చును. కృషిచేయక యెల్లవారును కాలముయొక్క రాకకే వేచియుండెడుపక్షమున కాలమెప్పటికిని రానేరదు. ఎంతోకాలముక్రిందటనే లోకాభివృద్ధి నిమిత్తమయి యెంతో కష్ట

పడి పరోపకారపరాయణులయిన మహానుభావు లనేకు లెన్నెన్నో ఘనకార్యములను నిర్వహించియున్నారు. ధర్మశూరులైన యామహాత్ములకు వెనుకనే కాలమువచ్చినను ధర్మభీరులయినవారి కింకను కాలమురాకున్నది. అట్టివారియొద్ద కెన్నటికినిరాదు. దృఢనిశ్చయమునకు కాలముసహిత మెప్పుడును లోఁబడియే యుండునుగాన దృఢనిశ్చయముగలవాఁ డెట్టికార్యమునైనను ఎప్పుడైనను సాధింపఁగలుగును. దృఢచిత్తునకు తన చింత పరిశుద్ధమయి యీశ్వరునకు ప్రీతికరమయినప్పు డితరుల యభిప్రాయముతోఁగాని మెప్పుతోఁగాని పనియుండదు. తనకు సత్కార్యాచరణమునందు దృఢచిత్తములేక యితరుల నాలోచన యడుగఁబోయినప్పు డనేకు లనేకవిధములుగాఁ జెప్పుదురు. వారిలోఁ గొందఱామోదింతురు; కొందఱు పరిహసింతురు; కొందఱు భూషింతురు; కొందఱు దూషింతురు. అట్టిసమయమునం దట్టివానిచిత్తము స్థైర్యమును విడిచి గాలిలోనిదీపమువలె -నల్లలనాడుచుఁ బనికిమాలినదగును. కాఁబట్టి బుద్ధిమంతుఁడైనవాఁడు ముందుగానే చక్కఁగా నాలోచించుకొని తాను తలపెట్టిన పనియొక్క యుద్దేశము మంచిదయినపక్షమున, నడుమ నెన్నికష్టములు వచ్చినను తాను పూనినపనిని విడువక కొనసాగించుటకు దృఢనిశ్చయము చేసికొనవలెను. అట్టిదృఢనిశ్చయమే కార్యసిద్ధికి మూలము; దృఢనిశ్చయముగలవాఁడు తనకు సాధనకలాపము లేకపోయినను, విఘ్నములు వచ్చినను, జడియక యెప్పుడును కార్యసాధనమునందే దృష్టి యుంచును. లోకములోఁ గొందఱు తమకు ధనమును, బలమును, బుద్ధియు, అధికారమును, పాండిత్యమును, ఉండియున్నయెడలఁ దామెంతో లోకోపకారమును చేఁయగలుగుదుమని చెప్పుదురు. ఇవి యన్నియు నున్నను మనోనిశ్చయము లేకపోవుటచేత నేమియుఁజేయని

వారిని, ఇంకేమియు లేకపోయినను మనోనిశ్చయ మొక్కటి యుండుటచేత ననేకసత్కార్యములను జేయఁగలిగినవారిని, మన మెందఱినో కనియు వినియు నున్నాము. కాఁబట్టి కార్యసాఫల్యమునకు మనోనిశ్చయము ప్రథమసాధనము.

ఎంతటి మనోనిశ్చయమున్నను లోకహితార్థముగా నూతన కార్యమును పూని క్రొత్తత్రోవను ద్రొక్కువారికి కష్టములు రాక మానవు. అప్పుడు మనోనిశ్చయమునకు తోడు ధైర్యమును రెండవ సాధనముగా వహింపవలెను. ధైర్యముగలవాని కాకష్టములే కార్య నిర్వహణమునకు ప్రోత్సాహకరములును విజయదాయకములును అగును. ఈశ్వరప్రీతికయి యొకసద్ధర్మమును బ్రతిష్ఠింపఁ బాటుపడు వారికి వచ్చుకష్టము లనేకములుగా నుండును. మన మెవ్వరిక్షేమము నిమిత్తమయి సత్కార్యదీక్షను వహింతుమో వారే మనకు ద్వేషులయి కార్యవిఘాతమునకుఁ బ్రయత్నింతురు. లోకోపకార మొక్కటియే మన కర్తవ్యకృత్యము; లోకులు దానికర్హులయినను గాకపోయినను, ప్రపంచము దానినంగీకరించినను అంగీకరింపకపోయినను కూడ లోకమునకు మేలు చేయఁగడఁగుట మానవరూపమును ధరించిన మన కుత్తమధర్మము. అట్టిపని భగవంతుని కెప్పుడును తృప్తికరముగా నుండును; అందువలన మనయంతరాత్మయు సంతోషించును. ఆత్మానందమున కీశ్వరునిమెప్పు కావలసినదే కాని లోకముయొక్క యంగీకారముతోఁగాని మెప్పుతోఁగాని పనిలేదు. లోకమునకు మనము చేయఁబూనిన యుపకారమునకు మనము జనులవలన ప్రత్యుపకారమునుగాని కృతజ్ఞతనుగాని శ్లాఘననుగాని యపేక్షింపక ఫలనిరపేక్షముగా పరమేశ్వరప్రీతికయి యది ధర్మమనుబుద్ధితో చేయవలెను. ఇతరుల యనుగ్రహమును మెప్పును సత్కార్యత్యాగము

నకు ప్రతిఫలములు కానేరవు. గనుక మనము వానిని సరకుగొనక కష్టములకు సహించి ధైర్యముతో నిలువవలయును. ఇటువంటి సమయములయందు మనకావలకు తోడ్పాటుగానున్న మిత్రులు సహితము మనలను చేయివిడుతురు; బంధుజనులు పరిత్యజింతురు; సహాయులు దూరముగా తొలఁగుదురు. లోకమంతయు మనలను విడిచినను విడువనిండు. ఎవ్వరు మనలను విడిచినను మనము ధైర్యమును మాత్రము విడువక ధర్మబలమును నమ్మకొని యసహాయశూరుల మయి ప్రవర్తింపవలెను. ఇతరుల సాహాయ్యమును బొందకయే మన మొక ఘనకార్యమును నిర్వహించినయెడల మనకది మఱింత ప్రతిష్ఠావహము. లోకమంతయు మనలను నిరోధించినను, లోకేశ్వరుఁడు మనకు ప్రాపైయుండఁగా మనము భయపడవలసినపని లేదు.

ఒకానొకప్పుడు బంధుజనులు మొదలయినవారు తీయని మాటలు చెప్పియు, బోధించియు, ప్రేమను నటించియు, కన్నీరు నించియు, ప్రార్థించియు మనలను సత్కార్యములనుండి మరలింపఁజూతురు. మనయందును, సత్యమునందును, ధర్మమునందును గౌరవము లేనివారిపయిని మనమేల గౌరవముంచవలెను? మనయంతరాత్మ సంతోషమును వారు చూడనప్పుడు వారి సంతోషమును మనమేల చూడవలెను? మన యంతరాత్మయు భగవంతుఁడును మంచిపని యనిచెప్పి సంతోషించుచుండఁగా, ఈశ్వరునియందును మానవ ప్రకృతియందును గౌరవములేని స్వార్థపరులు సంతోషింపకపోయిన యెడల మనకేమిలోపము? ధర్మాచరణవ్యవసాయమునందు కార్యసాఫల్యమైనప్పుడు కలుగుసంతోషముతో సమానమయిన సంతోషము లోకములో మఱియొకటి యుండునా? మనకదియొక్కటి చాలదా? కాఁబట్టి సత్కార్యములనుండి మనలను మరలించి యాత్మ

నందసుఖములకు భంగము కలిగింపఁ జూచువారి మంచిమాటలను చక్కెర మెత్తిన విషఘుటికలనుగా భావించి దూరముగా పరిహరింప వలయును.

మంచిమాటలు పనిచేయనప్పుడు వారు మనలను దూషించి బెదిరింప నారంభింతురు. అట్టి దూషణములకును మనము భయపడఁ గూడదు. వారు మనలను మాటలచేత తిరస్కరించు చున్నప్పుడు ప్రతిదూషణమునకు దిగక పూనిన యుద్యమమును విడువక మనము వారిని కార్యముచేత తిరస్కరింపవలెను. మనము కొంతకాలము వారిదూషణములకును వారు మనకుంచెడు పతిత, నాస్తికాది బిరుద నామములకును వారు చేసెడు పరిహాసములకును సహించి నిలిచి ధైర్యముతో పనిచేయుచు వచ్చినపక్షమున, కడపట వారే విసుగు చెంది తమ పరిహాసములు మనమీఁద వ్యర్థమయినవని సిగ్గుపడి యెగ తాళిచేయ మానుకొందురు. తమ పరిహాసములను లక్ష్యపెట్టక పోవుట వలన వారొకవేళ మనలను మొండివారని భావించినను భావింప నిండు. అందువలన మనము గర్వపడవలసినదేకాని యెంతమాత్ర మును సిగ్గుపడవలసిన పనిలేదు.

మన ప్రతిపక్షులు కొన్నిసమయములయందు దూషణముల తోను, పరిహాసములతోను, తిట్లతోను తృప్తినొందక దౌర్జన్యమును జూపి మనకనేకవిధములయిన బాధలను జేయుదురు. ఒకసత్కార్య మును సాధింపఁ దలంపుగొన్నవాఁడు దానివలన వచ్చెడు సత్ఫలము లకువలెనే దుష్ఫలములకును తలయొగ్గవలెను; ఎన్ని కష్టములు వచ్చి నను వెనుకంజవేయక ముందడుగిడుచుండవలెను. ఆపదలు వచ్చి నప్పుడు జడిసి పౌరుషము విడిచి లోఁబడుటకంటె నవమానకరము మఱియొకటిలేదు. సత్కార్యాచరణమునందే పౌరుషము లేకపోయి

నప్పుడిఁక మానవుని పౌరుషమేటికి ? కాల్పనా ? పురుషనామమును ధరించినవానికి ప్రతిపక్షము లెక్కువయయి కష్టము లాపాదించుచున్న ప్పుడే వారిని సాధింపవలెనన్న యావేశముచేతను రోషముచేతను సత్కార్యాచరణమునందు ధైర్య మెక్కువ కావలెను. ఝంఝా మారుతమువలన మిణుకు మిణుకు మను దీపము లాఱిపోయినను దావాగ్ని ప్రజ్వరిల్లునట్లుగా ప్రతిపక్షుల ద్వేషమారుతములవలనను మహాత్ముల హృదయములయం దార్పరాని యుత్సాహదావాగ్ని ప్రజ్వ రిల్లి దుస్సహమయి విఘ్నమృగములను భస్మముచేయును. తగినకష్టము లేక లోకములో నెంతటి చిన్నపనియు నెఱవేఱదు. ప్రతికార్యమును కష్టమువలననే సఫలముకావలెనని భగవదుద్దేశము. నడుచునప్పుడు పడు నని శిశువును తల్లి తొట్లలోనే బంధించి యుంచిన పక్షమున వాఁడెదిగి నప్పుడు నడువ నసమర్థుఁడగును. సానఁబెట్టిన మణివలెను, అఱుగఁ దీసిన గంధపుచెక్కవలెను, పురుషుఁడును కష్టములచేతను నలుగుడుల చేతను మాత్రమె వన్నెయు వాసియుఁ గాంచును. ఫలగౌరవమును బట్టి కష్టములు సహితము హెచ్చుచుండును. సత్కార్యములచేత లోకమున కనంతఫలములను కలుగఁజేయ యత్నించువాఁడు ప్రాణము విడువవలసినంత కష్టమువచ్చినను సంతోషముతో శిరస్సొగ్గ వలెను. ఎప్పుడయినను విడువవలసిన దేహమును హాయిగా లోకోప కారకార్యమునందు విడువక, సత్కార్యమును త్యజించి దీర్ఘవేదన ననుభవించుచు రోగములచే విడుచు నిమిత్త ముత్తమపురుషుఁడు దాచుకొనఁగోరునా ? కోరఁడు. దృఢచిత్తుని హృదయమెప్పుడును తాను పూనిన కార్యమునకు దుశ్ఛేద్యములయిన యినపగొలుసులతో బంధిం పఁబడియుండును గాన మృత్యుదేవత యొక్కతె తప్ప నితరు లా బంధము నెవ్వరును విడఁగొట్టఁజాలరు.

కార్యసాఫల్యమునకు నిరంతరకృషి మఱియొక సాధనము. విడు వక పట్టుదలతోఁ బనిచేయుచు వచ్చినపక్షమునఁ గాలక్రమమున నెటువంటి దుస్సాధ్యములును సుసాధ్యము లగును. నీరువంటి మృదు పదార్థము పడఁగా పడఁగా రాతివంటి కఠినపదార్థము సహితము కరుగు చుండఁగా నిరంతరకృషిచేత మనుష్యులు లోఁబడుట యేమి యాశ్చ ర్యము ? మన మెంతకృషిచేసినను కొన్ని సమయములయందు కార్యము విఫలము కావచ్చును. అందుచేత నిరుత్సాహమును పొందక కార్య మొకసారి విఫలమయిన పక్షమున మరల సఫలమగువఱకును మఱింత పూనికతోఁ బనిచేయవలెను. కార్యసాఫల్యమయినను మనము గర్వపడి దానితో సంతుష్టిపొంది యూరకుండక దేహములో ప్రాణమున్నంతవఱకు నొకటితరువాత నొకటిగా సదా సత్కార్యా చరణమునకే పూనుచుండవలెను. సత్కార్యములకయి కృషిచేయుట మాత్రమే మనధర్మముకాని వాని సాఫల్యవైఫల్యములు మనచేతి లోనివికావు. కార్యసాఫల్యమయినను కాకపోయిననుగూడ విడువక యీశ్వరసమ్ముఖమును జూచి మనశరీరప్రాణముల నీశ్వరార్పణముఁ జేసి మనకృషి మనము చేయుచుండవలెను. అప్పుడు మనుష్యులు మనలను దూరముచేసి విడిచినను, ఈశ్వరుఁడు దాపునకుఁజేర్చి కాపాడును.

మనకు సహాయసంపద లేదనియు నొంటిగాండ్ర మేమిచేయఁ గలమనియు నిరుత్సాహపడవలసినపనియు లేదు. ఈశ్వరుని ప్రాపున్నప్పు డితరుల తోడ్పాటు లేకున్న లోపమేమి ? అంతేకాక లోకములో ప్రతిమహత్తరపదార్థమును మొట్టమొదట చిన్నవస్తువునుండియే యారంభమగుచున్నది. నూఱులకొలఁది జనులకు నీడనిచ్చి శ్రమమడఁచు గొప్పమఱ్ఱిచెట్టు నలకంతబీజమునుండియే బయలుదేఱును. ఎన్నో దేశ ములలోఁ బ్రవహించుచు లక్షలకొలఁది జనులకు స్నానపానములకు జల

మిచ్చి సస్యాదులను ఫలింపఁజేయు మన యీ గోదావరీనదియు మొట్ట మొదట నాసికాత్రయంబకముకడ నొకచిన్న యూటలోనుండి పుట్టినదే. కాఁబట్టి మన మల్పసంఖ్యగలవారమని ధైర్యమును విడువక యీశ్వర బలమును జూచుకొని సత్కార్యాచరణమునకు సాహసింపవలెను. సకల సత్కార్యములయందును మన కీశ్వరుఁడు తోడ్పడునుగాక !
